క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



వీపనగండ్ల: ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ రవిప్రకాశ్ కోరారు. శుక్రవారం కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో సీఏపీఎఫ్ పోలీసులతో గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిబంధనలు ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని రాస్కె బచ్చన్న, లక్ష్మి కిరాణ దుకాణం ప్రమాదవశాత్తు కాలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన వారి పరిస్థితిని తెలుసుకున్న బీఆర్‌ఎస్ వనపర్తి నియోజక వర్గం ఇన్‌చార్జు ప్రమోద్‌రెడ్డి రూ.20 వేల ఆర్థికసాయం పంపారు. బూర్గుల వెంకటేశ్వర్‌రెడ్డి ద్వారా పంపిన సాయాన్ని ఖిల్లాఘనపురం సర్పంచు వెంకటరమణ, బీఆర్‌ఎస్ నాయకులు సత్యం, వెంకటేష్, బాబూజీ తదితరులు బాధిత ఇంటికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు.

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని చాణిక్య స్కూల్‌లో శుక్రవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ మేళా నిర్వహించారు. ఈ మేళా ఈనెల 24, 25వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాజుపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూకేజీ, 2, 4, 6, 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో 128 ప్రదర్శనలు చేశారని, అందులో 630 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఉపాధ్యాయ బృందం చెప్పారు. సైన్స్ విభాగంలో 56, బయోలాజికల్ సైన్స్‌లో 42, గణితంలో 12, సాంఘిక శాస్త్రంలో 18 ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో సోలార్, చెత్తతో కరెంట్, ఆసిడ్ ఉత్పాదన, గుండె నొప్పి, టర్నింగ్స్ వద్ద ప్రమాదాలు జరగకుండా, ఆయుర్వేద మొక్కలు, గ్రహాల ఏర్పాటు ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. సైన్స్‌ఫెయిర్‌ను రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. విద్యార్థులకు సైన్స్‌ఫెయిర్ నిర్వహించడం వల్ల సైన్స్ పట్ల అవగాహన పెంపొందుతుందని, దీంతో వారికి విషయ పరిజ్ఞానం పెరుగుతుందని పలువురు అన్నారు.

వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని షాబాద్ చెందిన బోయ పెద్ద నాగన్న (43)కు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఈనెల 19న ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నందిన్నెలో వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్ ఆదేశాల మేరకు మండలంలోని నందిన్నె చెక్‌పోస్టును ఏర్పాటు చేయగా శుక్రవారం ఎక్సైజ్ సీఐ ఖలీద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లిక్కర్, మద్యం, నగదు, అక్రమ రవాణాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను పరిశీలించిన తర్వాత వాహనాలను అనుమతి ఇవ్వాలని తెలిపారు. వారి వెంట కానిస్టేబుల్ మహేష్, చక్రవర్తి, వినయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యురాలు రిజ్వానా తస్వీర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రన్న, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



మహిళలకు నమస్కరిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ప్రత్యేక రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి నియోజవర్గంలోని పెద్దగూడెం, కడుకుంట్ల, మెంటిపల్లి, రాఘవేంద్రకాలనీ, నాచహళ్లి, సవాయిగూడెం, కిష్టగిరి, పెద్దగూడెంతండా, చందాపూర్, దత్తాయిపల్లి, దత్తాయిపల్లితండా, అంజనగిరి గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఉపాధిలో ముందజ

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన తొమ్మిదేళ్లలో 1.62లక్షల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 16లక్షల మందికి పారిశ్రామిక రంగాల్లో ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో వ్యవసాయ రంగం మీద 2.50కోట్ల మంది జీవనోపాధి కల్పిస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే పేదరికంలో ఉండే మహిళలకు రూ.3వేల సౌభాగ్యలక్ష్మి, భూమి లేని వారికి రైతుబీమా పథకం ఇస్తున్నామని తెలిపారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్, ధర కేంద్రం చేతిలో ఉందని అది పెరగడమే తప్ప తగ్గడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో రూ.400లకే వంట గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ చదువుకున్న వారి కోసం రూ.22కోట్లతో వనపర్తి జిల్లా కేంద్రంలో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో మన యువకులకు భవిష్యత్‌లో హైదరాబాద్ వెళ్లకుండా వనపర్తిలోనే ఉపాధి దొరుకుతుందన్నారు. అంతే కాకుండా ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఖిల్లాఘనపురం మండలానికి చెందిన ఓలియా దాసరి సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ద రాములుతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా కడుకుంట్లకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి మంత్రి నిరంజన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరు కలికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని బండరావిపాకులలో మంత్రి నిరంజన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తోందని, ఏదుల రిజర్వాయర్‌లో మునకకు గురైన బండరావిపాకుల, కొంకలపల్లి గ్రామాలకు సైతం పూర్తి స్థాయిలో ఆదుకుంటుందన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, అల్లమాయపల్లి, గట్టుకాడిపల్లి, ఆగారం తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలు కదిలి ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ గెలుపు కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. వృద్ధులు, మహిళలు, యువకులు ప్రతి ఒక్కరిని కలిసి బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అభివృద్ధి జరగాలంటే కారుకు ఓటు వేయాలని చెప్పారు.



అప్పారెడ్డిపల్లిలో..



మంత్రి ప్రచారానికి భారీగా తరలివచ్చిన జనం



కొత్తబండరావిపాకులలో రావుల చంద్రశేఖర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మొద్దు



వృద్ధుడితో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి

మక్తల్: బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని మక్తల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి కోరారు. మండలంలోని మాద్వార్, లింగంపల్లి, ఉప్పర్‌పల్లి, సోమేశ్వర్‌బండలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరబండకు చెందిన 50 మంది నాయకులు జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగిరే వరకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మాదిరెడ్డి పద్మజారెడ్డి మక్తల్ పట్టణంలో జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఆశప్ప, భాస్కర్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వలింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్/అమరచింత: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమవుతుందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని కర్నాటక రాష్ట్రం కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూర్, అమరచింత బీజేపీ కార్యాలయంలో బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రాల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కేసీఆర్ కుటంబ పాలనకు విముక్తి కల్పిస్తామని, అవినీతితో వారు సంపాదించిన సొమ్మును కక్కిస్తామన్నారు. ఈసందర్భంగా తిప్డంపల్లికి చెందిన 30మంది బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. సమావేషంలో బెంగుళూరు ఫ్లోర్‌లీడర్ పద్మనాభరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, జిల్లా నాయకులు మరాఠి అశోక్, నరాల నారాయణ, పద్మజారెడ్డి, క్యామ భాస్కర్, హరీష్, భీంరెడ్డి, అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, రాజు, నాగేందర్‌రెడ్డి, శేషు, రఘు, రవి, కొండాపురంరాము, బాలు ఉన్నారు.



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

బీజేపీతోనే పేదల సంక్షేమం



కొల్లాపూర్‌లో బీజేపీలో చేరిన నాయకులతో ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎల్లేని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై యువకులు బీజేపీలో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో తప్పనిసరిగా బీజేపీ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌ను 19 ఏళ్లు పాలించిన జూపల్లి కృష్ణారావు, ప్రస్తుత ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన వివరించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొల్లాపూర్‌కు రైల్వేలైన్, పారిశ్రామిక జోన్ తీసుకువస్తానని ఆయన వెల్లడించారు. అదేవిధంగా ఎల్లేని సుధాకర్‌రావు కూతురు తేజస్విని పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం చేస్తూ ఆకట్టుకున్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు భీమేష్ ఇంటింటి ప్రచారం చేశారు. సాతాపూర్‌లో ఎల్లేని సతీమణి భారతమ్మ ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని డిపో మేనేజర్‌కు వినతి



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న గోపి తదితరులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు ఆర్‌టీసీ బస్సులు నడపాలని కోరుతూ శుక్రవారం వనపర్తి ఆర్‌టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంటు మేనేజర్ దేవేందర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన వారు బస్టాండు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త కమ్మరి గోపితో పాటుగా పలువురు మండల ప్రజలు వారిని కలిసి సమస్యలను వివరించారు. మండలంలోని అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, అల్లమాయపల్లి, మామిడిమాడ, షాపురం, ఆముదంబండ తండా తదితర చాలా గ్రామాలు, గిరిజన తండాలకు బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే కనీసం 6 నుంచి 10 కిలోమీటర్లు ఆటోల్లో ప్రయాణం చేయాల్సిందేనని తెలిపారు. అదేవిధంగా ఎక్స్‌ప్రెస్ బస్సులను మండలం మీదుగా మహబూబ్‌నగర్‌కు నడపాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని గోపి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం ఫలాలు



మక్తల్‌లో శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మత్స్యకార సంఘం సభ్యులు

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగంబండ రిజర్వాయర్ అధ్యక్షుడు తిప్పణ్ణ, మల్లేపల్లి రమణ, శంకరప్ప, భీమప్ప, నాగరాజు, రామకృష్ణ, వెంకటేష్, నర్సింలు, శివశంకర్, గోపాల్, ఆనంద్, శంకర్‌తో పాటు మాద్వార్, ఉజ్జెల్లి, నేరడగం, సోమేశ్వర్‌బండ గ్రామాలకు చెందిన నాయకులు వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో ప్రతి ఓటరు ఆశీర్వదించి గెలిపిస్తే సేవకుడిగా ఉంటానన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, నీలప్ప, రామారావు, కావలి తాయప్ప, కట్ట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి

అమరచింత: మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్ అన్నారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు పట్టణంలోని మూడో వార్డులో కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే షాదీముబారక్ పథకం కింద రూ.1,60,000 ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తౌఫిక్, అబిద్, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

సలాం భాయ్.. ఓటు మాకే..

సలాం వాలేకూం భాయ్.. అంటూ మసీదు వద్ద టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ముస్లింలను కలిసి వాకిటి శ్రీహరిని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయనను ముస్లిం కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

మరికల్: పదేళ్ల అధికారంలోకి ఉండి ఏమి చేయలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం కోసం మాయ మాటలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందని వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చిత్తనూర్, జిన్నారం, ఎక్లాస్‌పూర్, కన్మనూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నారంరెడ్డి, రవి, కుర్మయ్య, రామకృష్ణ, విజయ్‌మోమణ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్: సబ్‌కా సాద్ కాంగ్రెస్ వికాస్.. కాంగ్రెస్ కో ఓట్ దేకే వాకిటి శ్రీహరికో జితావో అంటూ కాంగ్రెస్ నాయకులు ముస్లిం ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం మున్సిపాలిటీలోని మస్జిద్‌ల వద్ద ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం కుమ్మక్కయి ప్రజలను మోసం చేస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 500లకే వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, తులసీరాజ్, పరమేష్, నల్గోండ శ్రీను, రహ్మతుల్లా, అజ్మతుల్లా, గంగాధర్, వెంకటన్న, అక్బర్, జుబేర్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కుర్ని రవికాంత్ తదితరులు ఉన్నారు.



అమరచింత జామీయా మసీదు వద్ద నాగరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెంట్లవెల్లి: జటప్రోల్, గోపులాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఏపీఎం గౌస్‌దీన్, సీసీ శోభ కోరారు.

ఒక్కసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి



మాట్లాడుతున్న శిరీష

వీపనగండ్ల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కొల్లాపూర్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి బర్రెలక్క అలియాస్ శిరీష అన్నారు. శుక్రవారం మండల ంలోని తూంకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్లలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి ఓటు బుద్ధిచెప్పాలన్నారు. పేద కుటుంబానికి చెందిన తనను ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు.

మద్యం పట్టివేత

మానవపాడు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. మండల కేంద్రంలోని వైన్స్ నుంచి అక్రమంగా రూ.83వేల విలువగల మద్యాన్ని తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుపడినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తేమ పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో తేమ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, వంక గోపాల్ అన్నారు. శుక్రవారం బొల్లారంలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 14శాతం తేమ ఉండాలన్న నిబంధనలతో రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికే ఉందన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వారం రోజులుగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, అకాల వర్షాలు వచ్చినా ధాన్యాన్ని కప్పుకునేందుకు టార్పాలిన్ కవర్లు అందజేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కాటం బాలస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ లేని హామీలు నమ్మొద్దు



అన్నారంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని ఎత్తుకున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్, కిష్టాపూర్‌తండా, గోప్లాపూర్, అన్నారం, దావాజిపల్లి, దొండాయిపల్లి, మల్లాయిపల్లి, చింతకుంట, మాందాపూర్, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 19 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న జూపల్లి నియోజకవర్గాన్ని ఏనాడు పట్టించుకోలేదన్నారు. ఆయన పాలనలో అమాయకులపై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. 24 గంటల కరెంటా.. నాల్గు గంటల కరెంటు కావాలా..? ప్రజలు ఆలోచించుకొని ఓటు వేయాలన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత, వెంకటయ్యనాయుడు, కుర్వ బాలయ్య, సోమ్‌నాథ్‌నాయక్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఆర్‌ఎస్ ప్రచారం

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి విజయ శుక్రవారం ఖాదర్‌పాష దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ముస్లింల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కొల్లాపూర్‌లో హర్షవర్ధన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే తల్లి బిచ్చమ్మతో పాటు, బీఆర్‌ఎస్ నాయకులు వేర్వేరుగా పట్టణంలోని వార్డుల్లో ప్రచారాలు చేపట్టారు. బీఆర్‌ఎస్ ద్వారా రైతు, మహిళా సంక్షేమం సాధ్యమని వివరించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే కరెంట్ కష్టాలు ఏర్పడతాయని, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు కొనసాగవన్నారు.

పెద్దకొత్తపల్లి: యాపట్ల, ఆదిరాల, జొన్నలబొగుడ గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదిస్తే అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రసాద్ రావు, ఆదిరాల గ్రామంలో సర్పంచ్ భాగ్యమ్మ కుర్మయ్య, జొన్నలబొగుడలో సర్పంచ్ ఇందిరా రవినాయక్‌ల ఆధ్వర్యంలో ప్రచారంలో పాల్గొన్నారు.



రేమద్దులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం



ఖాదర్‌బాష దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న బీరం విజయ



కొల్లాపూర్‌లో..